సాక్షి ఖమ్మం

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



ఇక ఇసుక బజార్లు!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం నియోజకవర్గానికి ఒక ఇసుక బజార్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 8లో



ఆఫీసులకు సౌరవెలుగులు..

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల భవనాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 23°

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం పెరిగే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మంక్రైం: ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. రాజీమార్గాన్ని రాజ మార్గంగా భావించాలని.. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు పరస్పర అంగీకారానికి వస్తే సత్వర పరిష్కారం పొందొచ్చని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసుల్లో కక్షిదారులు రాజీపడే అవకాశం ఉందని వెల్లడించారు. చిన్న కేసులతో సమయం, డబ్బు వృథా కావడమే తప్ప ఎలాంటి ఫలితం ఉండదని తెలిపారు. ఈమేరకు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో సీపీ విజ్ఞప్తి చేశారు. కాగా, పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వర్తించే సిబ్బంది రాజీపడదగిన కేసుల్లో ఇరువర్గాలు లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచనలు చేశామని తెలిపారు.

గిరిజనులకు సంక్షేమ పథకాలు చేరేలా అవగాహన



శిక్షణలో మాట్లాడుతున్న డీడీ విజయలక్ష్మి

రఘునాథపాలెం: ఆది కర్మయోగి అభియాన్ పథకం ద్వారా అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి సూచించారు. పథకంపై రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం డీడీ మాట్లాడుతూ పూర్తిగా వెనుకబడిన గిరిజన గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను 2028 నాటికి చేరవేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాల లబ్ధిని గిరిజనులు అందుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏఓ నారాయణరెడ్డి, ట్రెయినర్లు బాలు, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు



రిటైనింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో జలవనరుల శాఖ పరిధిలో జరుగుతున్న పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా అంచనాల ప్రకారం కొనసాగించాలని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ సీ.హెచ్.బుచ్చిరెడ్డి ఆదేశించారు. ఖమ్మంలో మున్నేటి వెంట రిటైనింగ్ వాల్ నిర్మాణం, సీతారామ ప్రాజెక్టు 14, 15వ ప్యాకేజీ పనులతో పాటు వైరా రిజర్వాయర్ పరిధిలోని పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల నాణ్యతను తనిఖీ చేసిన సీఈ అవసరమైన మార్పులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమణ, డీఈ చంద్రమోహన్, జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ బాబురావు, డీఈ ఉదయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం: కలెక్టర్



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రజా చైతన్యమే లక్ష్యంగా మహాకవి కాళోజీ నారాయణరావు రచనలు చేశారని, సాహితీవేత్తగా సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కాళోజీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ అని, తెలంగాణ వైతాళికుడిగా నిలిచారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, డీఎంహెచ్ఓ కళావతిబాయి, సీపీఓ ఏ.శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో జీపీఓ(గ్రామ పాలనాధికారులు)ల నియామకంతో గ్రామస్థాయి రెవెన్యూ పాలన కొత్తరూపు సంతరించుకోనుంది. గతంలో వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి.. వారిని వివిధ శాఖల్లో భర్తీ చేశారు. అందులో ఆసక్తి ఉన్న వారిని ప్రస్తుతం జీపీఓలుగా నియమించారు. దీంతో మరోసారి పాత విధులు నిర్వర్తించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 380 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. వీటిని 299 క్లస్టర్లుగా విభజించారు. చిన్న క్లస్టర్లు అయితే రెండేసి, పెద్ద క్లస్టర్ అయితే ఒక్కో క్లస్టర్‌కు ఒక జీపీఓకు పోస్టింగ్ ఇచ్చేలా బుధవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

జీపీఓలతో రెవెన్యూ

కొత్త స్థానాల్లోకి పూర్వ వీఆర్ఓ, వీఆర్ఏలు

- వీరి నియామకంతో గ్రామపాలనకు పూర్వవైభవం
- క్లస్టర్ల వారీగా 252 మందికి నేడు కౌన్సెలింగ్, పోస్టింగ్



ఇటీవల కలెక్టరేట్‌లో ఆప్షన్ ఫారాలు ఇచ్చేందుకు వచ్చిన జీపీఓలు

అవినీతికి కారణమని..

గ్రామస్థాయిలో సమస్యలు వస్తున్నాయని, రెవెన్యూ శాఖలో అవినీతి కారణంగా ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోందనే కారణంతో 2020లో గత ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేసింది. ఇక వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడంతో గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ లేకుండా పోయింది. దీంతో ఏ చిన్నసమస్య వచ్చినా తహసీల్దార్ కార్యాలయాలకే పరిగెత్తాల్సి వచ్చింది.

జీపీఓలుగా నియామకం

ఐదేళ్లుగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు లేక పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో జీపీఓ(గ్రామపాలనాధికారులు)ల నియామకానికి నిర్ణయించింది. గతంలో వీఆర్ఓ, వీఆర్ఏలుగా పనిచేసిన వారిలో ఆసక్తి ఉన్న వారికే జీపీఓలుగా అవకాశం కల్పించారు. ఇందుకోసం పరీక్ష నిర్వహించాక నియామకాలు చేపడుతుండడంతో మళ్లీ గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

జిల్లాలో 252 మందికి అవకాశం

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 380 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిని 299 క్లస్టర్లుగా విభజించగా 252 మంది జీపీఓలను నియమించారు. ఇటీవల అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పరీక్షలో ఉత్తీర్ణులైన గ్రామపాలనాధికారులతో సమావేశమై నిర్వర్తించాల్సిన విధులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆప్షన్ ఫారాలు స్వీకరించిన నేపథ్యాన బుధవారం కలెక్టరేట్‌లో సమావేశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. స్పౌజ్, పీహెచ్‌సీ, మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం పోస్టింగ్ ఇస్తారు. అయితే, 299 క్లస్టర్లకు 252 మంది జీపీఓలే ఉన్నారు. దీంతో రెండేసి చిన్న క్లస్టర్ల బాధ్యత ఒకరికి అప్పగించనున్నారు.

గ్రామస్థాయిలో గందరగోళం

గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ లేక పలు సమస్యలు పేరుకుపోయి ఇటు ప్రజలు., అటు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు మొదలు భూసమస్యల పరిష్కారం వరకు తహసీల్దార్ కార్యాలయాలే దిక్కయ్యాయి. అన్ని సమస్యల పరిష్కారంలో కీలకమైన రెవెన్యూ వ్యవస్థ గ్రామస్థాయిలో నిర్వీర్యం కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

గ్రామస్థాయిలో జీపీఓలదే బాధ్యత

గతంలో గ్రామీణ ప్రాంతం నుంచి సీసీఎల్ఏ వరకు రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉండేది. అదేస్థాయిలో మరోసారి రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో పనిచేసిన వీఆర్ఓలకే ప్రభుత్వం జీపీఓలుగా బాధ్యతలు అప్పగిస్తోంది. వీరి నియామకంతో గ్రామస్థాయిలో భూ సమస్యలకు పరిష్కారం సులువవుతుందని భావిస్తున్నారు. జీపీఓలు భూ రికార్డుల నిర్వహణతోపాటు వివిధ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ప్రాథమిక నివేదిక ఇస్తారు. ప్రకృతి వైపరీత్యాల సమయాన ప్రభుత్వం తరఫున ప్రజలకు అండగా నిలుస్తారు. ఎన్నికల సందర్భంగా బీఎల్ఓలుగా వ్యవహరిస్తారు. ఓటర్ల జాబితా తయారీలో కీలకంగా పనిచేస్తారు. సంక్షేమ ఫలాలు అమలు చేసేందుకు నివేదికలు అందిస్తారు.

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం



ట్రాక్టర్‌పై బుచ్చిరెడ్డిపాలెం వెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కలెక్టర్ అనుదీప్ తదితరులు

- రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దుతా...
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఇనద్రమ్మ చెరువును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ అనుదీప్, డీఎఫ్ఓ సిద్ధార్థ్

ఎర్రుపాలెం: మారుమూల గ్రామాల్లోని ప్రజల అవసరాలు తీరుస్తూ, మౌలిక వసతులు కల్పించి జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో భట్టి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే 50ఏళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం సుడిగాలి పర్యటన

ఎర్రుపాలెం మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని అయ్యవారిగూడెం, ఎర్రుపాలెం, పెద్దగోపవరం, బనిగండ్లపాడు బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో రూ.4 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పెద్దగోపవరం, భీమవరంలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేశారు. బనిగండ్లపాడులో భోజన విరామం అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, డీపీఓ ఆశాలత, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకూబ్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, తహసీల్దార్ ఉషాశారదతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఇక బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలోని ఇనద్రమ్మ చెరువును కలెక్టర్ అనుదీప్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌లతో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. అక్కడకు వెళ్లే రహదారి ఇటీవల వర్షాలతో బురదమయంగా మారడంతో ట్రాక్టర్‌పై వెళ్లారు. ఇనద్రమ్మ చెరువును పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆతర్వాత జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఈఓ జగన్మోహన్ రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మతో కలిసి భట్టి ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి, అనుమోలు కృష్ణారావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, శీలం వెంకట్రామిరెడ్డి, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత

- ప్రజలు మెచ్చేలా ప్రభుత్వ పాలన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

కూసుమంచి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తమ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ప్రారంభించిన మంత్రి.. కిష్టాపురం, జుజుల్‌రావుపేటల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన బూట్లు, సాక్సుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కాటమయ్య కిట్లు, క్రైస్తవ మహిళలకు కుట్టుమిషన్లు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి పంపిణీ చేశారు.

అన్ని హామీలు అమలుచేస్తాం

ఎన్నికల వేల ఇచ్చిన హామీలన్నీ అమలుచేసేలా ముందుకెళ్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆర్థిక భారం ఉన్నా దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా పథకాలు అమలుచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఎన్నడూలేని విధంగా 7.5 లక్షల తెల్లరేషన్ కార్డులు జారీ చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో పథకాలు మరింత జోరందుకోనున్నందున ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి కోరారు.

యూరియా పంపిణీలో సమస్యలు రావొద్దు

పాలేరు నియోజకవర్గంలో యూరియా పంపిణీలో సమస్యలు రాకుండా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి యూరియా పంపిణీపై సమీక్షించిన ఆయన పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఈనెల 3నుంచి ఇప్పటి వరకు 610 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని అధికారులు చెప్పగా, భవిష్యత్‌లో ఇదే కొనసాగించాలని సూచించారు. కాగా, జీపీఓలుగా నియమితులైన పూర్వ వీఆర్ఓలు, వీఆర్ఏలు మంత్రిని కలిసి తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పేరు నిలబెట్టేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నిజాయితీగా, చిత్తశుద్ధితో సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, డీఎల్పీఓ రాంబాబు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, సీఐ సంజీవ్, ఏడీఏ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో పంట నష్టం గుర్తింపు


మిగతా చోట్ల కొనసాగుతున్న ప్రక్రియ



వర్షానికి నేలవాలిన వరి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల భారీ వర్షాలతో జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని గుర్తించేందుకు వ్యవసాయ శాఖ చేపట్టిన సర్వే కొనసాగుతోంది. గత నెల మూడు, నాలుగో వారాల్లో అల్పపీడనం, నైరుతి రుతుపవనాల కారణంగా భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులు, నదులు, జలాశయాల పరీవాహకం, పల్లపు ప్రాంతాల్లో పంటలు వరద ముంపునకు గురయ్యాయి. ఈమేరకు పంట నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఏఈఓలతో సర్వే చేయిస్తున్నారు. ఇప్పటివరకు ఆరు మండలాల్లో సర్వే పూర్తి కాగా, మరో మూడు మండలాల్లో కొనసాగుతోందని అధికారులు తెలిపారు. కాగా, ఆరు మండలాల్లో 595 మంది రైతులకు చెందిన 775.37 ఎకరాల్లో పత్తి, వరి, పెసర పంటలకు నష్టం జరిగిందని ఏఓలు నివేదిక అందజేశారు. రఘునాథపాలెం మండలంలో 18, కూసుమంచి మండలంలో 197, కల్లూరులో 77.12, తల్లాడ మండలంలో 34, ఏన్కూరు మండలంలో 30.25, కారేపల్లి మండలంలో 108 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు నివేదికల్లో పేర్కొన్నారు. ఇక కొణిజర్ల, వైరా, చింతకాని మండలాల్లో సర్వే చివరి దశలో ఉంది. ఈ మండలాల్లో 2,500 ఎకరాలకు పైగా పెసర, వరి, పత్తి పంటలకు నష్టం జరిగినట్లు సమాచారం. మొత్తంగా జిల్లాలో పంట నష్టం వివరాలను ఒకటి, రెండు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది.

రక్షణ.. ఇంకొంత దూరం



ఇటీవల రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు

- రిటైనింగ్ వాల్ పొడిగింపునకు కసరత్తు
- అదనంగా రూ.600 కోట్లతో నిర్మాణం

ఖమ్మంఅర్బన్: మున్నేటికి ఏటా వస్తున్న వరదతో ఖమ్మం నగరం వైపు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. గత ఏడాది కనీవిని ఎరుగని రీతిలో నష్టం ఎదురుకావడంతో ఇప్పటికే రూ.690 కోట్ల అంచనాలతో మున్నేటికి ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నారు. అయితే, ముంపు సమస్యను మరింత తగ్గించేలా గోడను ధంసలాపురం వరకు ఇరువైపులా మరో 12 కి.మీ. మేర నిర్మించాలని నిర్ణయించారు. ఈమేరకు అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించగా.. నిర్మాణం, భూసేకరణకు రూ.600 కోట్ల వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

పొడిగింపుతో మరింత భరోసా

ప్రస్తుతం మున్నేటికి ఇరువైపులా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోంది. ఖమ్మం నగరంలో దానవాయిగూడెం నుంచి ప్రకాష్‌నగర్ వంతెన వరకు నిర్మిస్తుండగా, అక్కడి నుంచి ధంసలాపురం వద్ద నేషనల్ హైవే వంతెన వరకు పొడిగించాలని నిర్ణయించారు. తద్వారా శ్రీనివాస్‌నగర్, ధంసలాపురం, అగ్రహారం కాలనీ ప్రాంతాలకు సైతం ముంపు నుంచి రక్షణ లభిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో మున్నేటికి వచ్చిన భారీ వరదతో ధంసలాపురం, అగ్రహారం ప్రాంతాల్లో సుమారు 1,300 పైగా ఇళ్లు నీట మునగగా పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యాన రిటైనింగ్ వాల్‌ను పొడిగించడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భావిస్తున్నారు.

సర్వే అనంతరం స్పష్టత



రిటైనింగ్ వాల్ పొడిగింపునకు మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో మా శాఖ ఉద్యోగులు సర్వే చేశాక అంచనాలతో నివేదిక రూపొందిస్తాం. తద్వారా ఎంత మేర భూమి అవసరం, నిధులు ఎంత కేటాయించాలో స్పష్టత వస్తుంది.

– మంగళపూడి వెంకటేశ్వర్లు, జలవనరులశాఖ ఎస్ఈ

ఆడపడుచులకు బతుకమ్మ కానుక

- ఎస్‌హెచ్‌జీల సభ్యులకు రెండేసి చీరలు
- జిల్లాకు 3.35 లక్షలు చీరల కేటాయింపు
- విడతల వారీగా వస్తున్న స్టాక్



గోదాంలో డంప్ చేస్తున్న చీరల బేళ్లు



మహిళలకు ఇచ్చే వివిధ మోడళ్ల చీరలు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు కానుక అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ప్రభుత్వం తరఫున చీరలు పంపిణీ చేస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యాన సిద్ధమైన చీరలను విడతల వారీగా జిల్లాకు చేరవేస్తున్నారు. బతుకమ్మ వేడుకల ప్రారంభానికి ముందే వీటిని అందించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మొదటి ఒకటి.. తర్వాత ఇంకొకటి

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం 3,35,878 చీరలు కేటాయించారు. సెర్ప్, మెప్మా పరిధిలోని సంఘాల సభ్యులకు రెండేసి చీరలు పంపిణీ చేస్తారు. బతుకమ్మ పండుగ ప్రారంభానికి ముందు ఒకటి.. వేడుకలు మొదలయ్యాక ఇంకొకటి అందించనున్నట్లు సమాచారం. తొలిదఫా ఇవ్వాల్సిన సుమారు 1.50 లక్షల చీరలు ఇప్పటికే చేరగా, మిగిలినవీ వారం రోజుల్లో వచ్చే అవకాశముంది. జిల్లాలో 20 మండల సమాఖ్యలు, 1,018 గ్రామ సమాఖ్యలు, 26వేల స్వయం సహాయక సంఘాల్లో 2లక్షలకు మందికి పైగా సభ్యులు ఉన్నారు.

స్టాక్ పాయింట్లలో నిల్వ

జిల్లాకు చేరుకున్న చీరలను అధికారులు స్టాక్ పాయింట్లలో భద్రపరుస్తున్నారు. రఘునాథపాలెం (టేకులపల్లి జిల్లా మహిళా సమాఖ్య ప్రాంగణం), వైరా, మధిర మార్కెట్ల గోదాంలు, సత్తుపల్లి మండల సమాఖ్య కార్యాలయంలో డంప్ చేస్తున్నారు. అలాగే, మెప్మా పరిధిలోని సంఘాల సభ్యుల చీరలను ఆ విభాగం అధికారులకు అప్పగిస్తారు. బతుకమ్మ పండుగను మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా జరుపుకునేలా వేడుకలు ప్రారంభమయ్యేలోగానే చీరల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. చీరలను ప్రత్యేక సంచిలో ప్యాక్ చేసి ఇవ్వనున్నారు. ఆ సంచిపై ఇందిరాగాంధీ ఫొటో, ఇందిరా మహిళా శక్తి పేరిట లోగోతో పాటు 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' అని రాసి ఉంది. అలాగే, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రుల ఫొటోలు ముద్రించారు.

జిల్లాకు కేటాయించిన చీరలు, ఇప్పటివరకు చేరినవి

గోదాం	కేటాయించిన చీరలు	సరఫరా అయిన చీరలు
జిల్లా సమాఖ్య, టేకులపల్లి	1,50,084	68,135
వైరా ఏఎంసీ	52,399	26,200
మధిర ఏఎంసీ	34,254	17,127
సత్తుపల్లి ఎంఎస్ ఆఫీస్	38,812	38,812
మెప్మా	60,330	000
మొత్తం	3,35,879	1,50,274

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ..



యూనిఫామ్ శారీస్ కింద జిల్లాకు ప్రభుత్వం చీరలు సరఫరా చేస్తుంది. ప్రత్యేక సంచిలో ప్యాక్ చేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు అందజేయనున్నాం. ప్రభుత్వం నుండి మార్గదర్శకాలు, విధివిధానాలు రాగానే పంపిణీపై స్పష్టత వస్తుంది. ఇప్పటి వరకు జిల్లాకు చేరిన చీరలను గోదాముల్లో భద్రపరుస్తున్నాం.

– సన్యాసయ్య, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

రావోజీతండా వాసికి డాక్టరేట్



గుగులోతు నెహ్రూ

కారేపల్లి: కారేపల్లి మండలం రావోజీ తండా గ్రామానికి చెందిన గుగులోతు నెహ్రూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి బాపట్ల వ్యవసాయ కళాశాలలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. వేరుశనగ సాగులో అధిక దిగుబడి, తెగుళ్ల నివారణపై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, నెహ్రూ తల్లిదండ్రులు రాందాస్, భద్రి వ్యవసాయం చేస్తుండగా.. రైతుల కుటుంబాలకు మేలు జరిగేలా మరిన్ని పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

జాబ్ మేళాలో 15 మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 56 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించగా 15మంది ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ జాబ్‌మేళాను పర్యవేక్షించారు.

అప్రమత్తతోనే సీజనల్ వ్యాధులు దూరం



ఉపకేంద్రం ఆవరణలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

బోనకల్: ప్రజలు ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కళావతిబాయి తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఇటీవల వర్షాలతో ఉపకేంద్రంలో నీరు నిలిచిందని, గ్రామంలోనూ డ్రెయినేజీలు లేక రోడ్లపై మురుగు నీటి ప్రవాహంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఉద్యోగులు చెప్పారు. ఈమేరకు డ్రై డే – డ్రై డే, శానిటేషన్ పనులపై పంచాయతీ కార్యదర్శి సైదులుకు డీఎంహెచ్‌ఓ సూచనలు చేశారు. అంతేకాక దోమల నివారణ, ఇతర జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డీపీఓ ఎం.దుర్గ, వైద్యాధికారులు స్రవంతి, ప్రియాంక, ఉద్యోగులు పాల్గొన్నారు.

'పడిపోతున్న కార్మికుల జీవన ప్రమాణాలు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధానిగా మోదీ ఇంకొన్నాళ్లు కొనసాగితే కార్మికుల కనీస జీవన ప్రమాణాలు మరింత పడిపోతాయని తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన జిల్లా నాలుగో మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం కార్పొరేట్లకు అప్పగిస్తోందని ఆరోపించారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పనివిధానం తీసుకురావడం గర్హనీయమని పేర్కొన్నారు. కీలకమైన రవాణా రంగంపై పాలకులు చిన్నచూపు విడనాడకపోతే సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కాగా, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోడ్రైవర్లకు నెలకు రూ.12 వేలు, డ్రైవర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు.అనంతరం సంఘం నూతన అధ్యక్షుడిగా వై విక్రమ్, కార్యదర్శిగా జిల్లా ఉపేందర్, కోశాధికారిగా ధరావత్ రాందాస్‌తోపాటు 31 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఇంకా ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.విష్ణు, నాయకులు పి.మోహన్‌రావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	4,000
కందులు	6,300	6,300
మినుములు	6,300	6,300
ఏసీ మిర్చి	15,350	8,000
మిర్చి	8,500	7,000
పత్తి	7,500	6,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.19,107

ఇక ఇసుక బజార్లు !

- ఇందిరమ్మ లబ్ధిదారులకు పంపిణీ కోసం ఏర్పాటు
- ఒక్కో ఇంటికి 10 ట్రాక్టర్ల ఇసుక ఇచ్చేలా నిర్ణయం
- టన్ను రూ.1,100 ధరతో విక్రయం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్ ఇసుక (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం ఇసుక బజార్లు అందుబాటులోకి తీసుకువస్తుంది. ఇసుక ధరలు ఎక్కువగా ఉండడమే కాక వర్షాకాలం కావటంతో పలు ప్రాంతాల్లో సరిపడా లభించడం లేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సమస్య ఎదురై ఆలస్యమవుతోంది. కొన్నిచోట్ల ధరల కారణంగా లబ్ధిదారులు నిర్మాణాలు నిలిపివేశారు. ఈ నేపథ్యాన ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇసుక బజార్ ఏర్పాటుచేయనున్నారు.

తొలి బజార్ కూసుమంచిలో...

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను టన్ను రూ.1,100 చొప్పున లబ్ధిదారులకు ఇసుక బజార్ల ద్వారా అందిస్తారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 10 టాక్టర్లు(40 టన్నులు) ఇసుక అందించేలా చర్యలు చేపట్టారు. ఈమేరకు తొలి ఇసుక బజార్‌ను కూసుమంచిలో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కాగా, లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ ఏఈ నుంచి ఇండెంట్ పొంది తహసీల్దార్‌కు అందిస్తే వారు కూపన్ల జారీ చేస్తారు. ఈ కూపన్ల ఆధారంగా ఇసుకను తీసుకోవచ్చు. లబ్ధిదారులే ట్రాక్టర్ తెచ్చుకోవాల్సి ఉండగా.. నిర్వాహకులు కాంటా పెట్టి అప్పగిస్తారు. కాగా, నగదు ఆన్‌లైన్‌లో చెల్లించేలా ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గాల వారీగా ఏర్పాటు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇసుక బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో ఇప్పటికే పాలేరు నియోజకవర్గ బజార్‌ను కూసుమంచిలో ఏర్పాటుచేశారు. ఇక ఖమ్మం నియోజకవర్గానికి ఎస్ఎస్‌పీ క్యాంపులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలతో పాటు ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కామేపల్లి మండలంలో కూడా ఇసుక బజార్ ఏర్పాటుకు నిర్ణయించారు. వీటిలో గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తారు. కాగా, మహిళా సంఘాల సభ్యులు ఇళ్లు నిర్మించుకుంటే టన్ను రూ.1,300 చొప్పున ఇసుక కొనుగోలుకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ ఆఫీసులకు సౌరవెలుగులు

- భవనాలపై సోలార్ పలకల ఏర్పాటు
- జిల్లాలో 4,700 భవనాల ఎంపిక
- మిగులు విద్యుత్ డిస్కంలకు విక్రయం



కోనాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంపై సౌర పలకలు

నేలకొండపల్లి: జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో త్వరలోనే సౌర వెలుగులు నిండనున్నాయి. విద్యుత్ అవసరాలు పెరుగుతుండడంతో బిల్లులు భారం తగ్గించేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పల్లె నుంచి పట్నం వరకు గ్రామ పంచాయతీ మొదలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర పలకలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో సౌర ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన భవనాలు కలిగిన కార్యాలయాలతో నివేదిక సిద్ధం చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులు ఆదా...

ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో ఉంటున్నాయి. కొన్ని కార్యాలయాల బిల్లులు చెల్లించకపోవడంతో పేరుకుపోతున్నాయి. ఈనేపథ్యాన ప్రభుత్వ భవనాలపై సౌర ప్లాంట్ల ఏర్పాటుతో కార్యాలయాల అవసరాలకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఎక్కడైనా మిగిలితే డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కార్యాలయాలతోపాటు ఇతర కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థల భవనాలపై సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. కాగా, ఇప్పటికే కొన్ని కార్యాలయాల్లో సౌర పలకలు ఉన్నా నిర్వహణ లోపంతో పనిచేయడం లేదని గుర్తించిన అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు.

4,700 విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం 4,700కు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. ఆయా భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో దాదాపు 30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశముందని అంచనా వేశారు. దీంతో త్వరగా ప్లాంట్లు ఏర్పాటుచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దేలా పనులు జరుగుతున్నాయి.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకుడు వీరస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

ఖమ్మం సహకారనగర్: కొత్త పెన్షన్ విధానం(సీపీఎస్)ను తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు జి.వీరస్వామి డిమాండ్ చేశారు. సంఘం జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం బకాయిలు 15నెలలు గడిచినా రాకపోవడంతో పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలు, మార్కెట్ కమిటీల్లో రిటైర్డ్ ఉద్యోగులకు సైతం ట్రెజరీల ద్వారా పెన్షన్ చెల్లించాలని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమించి హైదరాబాద్‌లో పెన్షనర్ల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వి.రాం మనోహర్, తుమ్మా వీరయ్య, కె.సుధీర్‌బాబు, రాయల రవికుమార్, కనపర్తి వెంకటేశ్వర్లు, మేరీ ఏసుపాదం, తాడి అంజలి, పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మి, సుజాత, అన్నమ్మ, ప్రసాదరావు, గుర్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, వ్యవసాయ మార్కెట్లలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మూడు నెలలుగా పెన్షన్ అందడం లేదని జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

న్యాయవాదిపై దాడి ఘటనలో 9మందిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన న్యాయవాది మహ్మద్ జహీర్‌అలీపై దాడికి పాల్పడిన తొమ్మిది మందిపై ఖమ్మం అర్బన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు... న్యాయవాది జహీర్ అలీ ఇంట్లోకి ఖమ్మంకు చెందిన మునీరుద్దీన్, సిరాజుద్దీన్ సహా తొమ్మిది మంది సోమవారం రాత్రి అక్రమంగా ప్రవేశించారు. ఆయనపై దాడి చేసి గాయపర్చడమే కాక చంపుతామని బెదిరించారు. ఈమేరకు జహీర్‌అలీ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఖమ్మంలీగల్: ఖమ్మంకు చెందిన సీనియర్ న్యాయవాది ఎండీ.జహీర్‌అలీపై దాడికి నిరసనగా న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన సమావేశమై ఒకరోజు కోర్టు విధులు బహిష్కరించాలని తీర్మానించారు. ఆతర్వాత న్యాయవాదులు జహీర్ అలీని పరామర్శించారు. కాగా, ఆయనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని కోరారు.

ఫ్యాక్టరీలకు సెలవు

దమ్మపేట: అశ్వారావుపేటతో పాటు దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు వరుసగా రెండు రోజుల సెలవులు ప్రకటించామని మేనేజర్ కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వారం రోజులుగా ఫ్యాక్టరీలకు పామాయిల్ గెలలు అధికంగా వచ్చాయని.. ఈ కారణంగా బుధవారం, గురువారం గెలలు కొనబోమని పేర్కొన్నారు. ఈనెల 12 (శుక్రవారం) నుంచి గెలలు యథావిధిగా కొంటామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

కమ్యూనిజానికి అంతం లేదు..



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కమ్యూనిజానికి అంతం లేదని.. కమ్యూనిస్టులు ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అధ్యక్షతన నిర్వహించారు. సురవరం చిత్రపటానికి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ సురవరం విద్యార్థి దశ నుంచే కమ్యూనిజాన్ని నమ్మి నిరంతర పోరాటాలు చేశారని తెలిపారు. కాగా, 2026 మార్చి వరకు మావోయిస్టులను అంతం చేస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన సరికాదని, మావోయిస్టు ప్రతి రక్తపు బొట్టు నుంచి తిరిగి ఉద్భవిస్తారని వ్యాఖ్యానించారు. వివిధ పార్టీల నాయకులు బాగం హేమంతరావు, ఆవునూరి మధు, అన్నవరపు సత్యనారాయణ, నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కెకె.అనంతరాములు, ఎస్.అనుదీప్, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

హై సెక్యూ్యరిటీ తప్పనిసరి!

- పాత వాహనాలకు కొత్త నంబర్ ప్లేట్లు
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- అవగాహన కల్పించడంలో అధికారుల వెనుకంజ



ఖమ్మంక్రైం: పాత వాహనాలకు హైసెక్యూ్యరిటీ (రిజిస్ట్రేషన్)నంబర్ ప్లేట్లను తప్పనిసరి చేస్తూ రవాణాశాఖ కొద్ది నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైన వాహనాలకు హై సెక్యూ్యరిటీ నంబర్ ప్లేట్లు(హెచ్‌ఎస్‌ఆర్‌పీ) అమర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈనెల 30 గడువుగా ప్రకటించినప్పటికీ రవాణాశాఖ ఆధ్వర్యాన వాహనదారులకు అవగాహన కల్పించడంలో చొరవ చూపకపోవడం గమనార్హం.

2019 మార్చి 31కి ముందు..

అన్ని వాహనాలకు హై సెక్యూ్యరిటీ నంబర్ ప్లేట్ల(హెచ్‌ఎస్‌ఆర్‌పీ) విధానాన్ని 2014 ఏప్రిల్ 18లో అమల్లోకి తీసుకొచ్చారు. ఆపై రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు నంబర్ ప్లేట్లు బిగించే బాధ్యత ఏజెన్సీలకు అప్పగించారు. కానీ 2019నుంచి అక్టోబర్ 19 నుంచి వాహనం కొనుగోలు చేశాక ఏజెన్సీ బాధ్యులు లేదా డీలర్ల వద్ద నంబర్ ప్లేట్లు బిగిస్తున్నారు. అయితే, 2019 మార్చి 31 వరకు(15ఏళ్లు నిండినవి) జిల్లాలో 1,40,589 వాహనాలు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ఖమ్మంలో రవాణా శాఖ యూనిట్ పరిధిలో 1,31,975, సత్తుపల్లిలో 4,783, వైరా రవాణా శాఖ కార్యాలయ పరిధిలో 3,831 వాహనాలు ఉన్నాయి. వీటిలో 1,24,496 ద్విచక్రవాహనాలు, 6,655 మోటారు కార్లు, 3,492 వ్యవసాయ వాహనాలతో ఇతరత్రా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇవీ ప్రయోజనాలు

వాహనాలకు హైసెక్యూ్యరిటీ నంబర్ ప్లేట్ బిగించడం వల్ల అనేక ఉపయోగాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్లేట్ చివరన ఉండే లేజర్ కోడ్ ద్వారా వాహనదారుడి పేరు, ఇతర వివరాలు తెలుసుకోవచ్చు. అంతేకాక వాహనం ధ్వంసమై నంబర్ ప్లేట్ మాత్రమే మిగిలినా పూర్తి వివరాల గుర్తింపునకు అవకాశముంటుంది.

స్పష్టత ఏదీ?

పదిహేనేళ్లు దాటిన వాహనాలన్నింటికీ ఈనెల 30వ తేదీలోగాహైసెక్యూ్యరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలుస్తోంది. గడువులోగా బిగించుకోకపోతే జరిమానా తప్పదని చెబుతున్నారు. కానీ గడువు సమీపిస్తున్నా రవాణా శాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించడంలో పెద్దగా చొరవ తీసుకోకపోవడం గమనార్హం. ఇదేమిటని ఆరా తీస్తే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి సరైన ఉత్తర్వులు అందలేదని సెలవిస్తున్నారు. దీంతో హైసెక్యూ్యరిటీ నంబర్ ప్లేట్లు బిగించుకోవాలా, తప్పనిసరేం కాదా అన్న విషయమై వాహనదారులకు స్పష్టత రావడం లేదు.

ఇద్దరు బాలికల అదృశ్యం

ఖమ్మంఅర్బన్: ఇద్దరు బాలికలు కానరాకుండా పోయిన ఘటన ఖమ్మంలో వెలుగుచూసింది. నగర శివారు ప్రాంతానికి చెందిన 13ఏళ్ల బాలికను ఆమె స్నేహితురాలైన 15 ఏళ్ల బాలిక సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లింది. అర్ధరాత్రి వరకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల ఆరా తీశారు. అయినా ఫలితం లేక ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ భానుప్రకాశ్, ఎస్సై గౌతమి ఆధ్వర్యాన సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా విచారణ చేపడుతున్నారు.

ఎన్డీలో విలీనం

ఇల్లెందు : సీపీఐ(ఎంఎల్) ఎన్డీలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రటిక్ రివల్యూషనరీ విలీనమైనట్లు ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ప్రకటించారు. ఈ విలీనంతో ఎన్డీ బలమైన పార్టీగా అవతరించిందని తెలిపారు. కాగా, ఎన్డీలో విలీనాన్ని న్యూడెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి నిర్ధారించారు.

ముహూర్తం కోసం వచ్చి అనంతలోకాలకు..

- లారీ ఢీకొని మృతిచెందిన దంపతులు
- ఎర్రుపాలెం మండలంలో ప్రమాదం



దామినేని శ్రీనివాసరావు, కుమారి (ఫైల్)

ఎర్రుపాలెం/కంచికచర్ల: కుమారుడి వివాహానికి ముందు ఇంట్లో కొలువైన ఉప్పలమ్మ తల్లికి పూజల తేదీ ఖరారు చేసేందుకు గురువు వద్దకు వచ్చి ఆనందంతో తిరిగి వెళ్తున్న దంపతులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. బైక్‌ను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి దామినేని కుమారి(45), శ్రీనివాసరావు(54) భార్యాభర్తలు. శ్రీనివాసరావు వ్యవసాయం చూస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమార్తె ఉమాదేవి, కుమారుడు చంద్రశేఖర్ ఉన్నారు. కుమార్తె వివాహం తమ గ్రామానికే చెందిన సాయితో జరిపించారు. ఇక బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న చంద్రశేఖర్‌కు ఇటీవల వివాహం కుదిరింది. కుమారుడి వివాహానికి ముందు తమ ఇంట్లో వెలసిన ఉప్పలమ్మ తల్లికి పూజలు చేసేందుకు శ్రీనివాసరావు, కుమారి దంపతులు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడులో ఉన్న ఓ పూజారి వద్దకు వచ్చి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఆపై బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎర్రుపాలెం – తక్కెళ్లపాడు మధ్య ఎదురుగా వచ్చిన కోళ్ల లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతుల తలలకు తీవ్ర గాయాలై ఘటనాస్థలంలోనే మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు చంద్రశేఖర్, కుమార్తె ఉమాదేవి కన్నీటిపర్యంతమయ్యారు. కొడుకు పెళ్లి చూడకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయారా అంటూ బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం అందరినీ కలిచివేసింది. కాగా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ గని ఆత్కూరులో శ్రీనివాసరావు, కుమారి మృతదేహాల వద్ద నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన దహన సంస్కారాలు నిర్వహించారు.

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం

వైరారూరల్: వైరా మండలం స్టేజీ పినపాక గ్రామంలో కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. గ్రామానికి చెందిన జంపాల నాగేశ్వరరావు (64) వివిధప్రాంతాల్లో పనిచేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్లేవాడు. ఆయన తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా, భార్యాపిల్లలు తల్లాడ మండలం కలకొడిమలో విడిగా ఉంటున్నారు. చివరిసారి ఈనెల 2వ తేదీన నాగేశ్వరరావు పినపాకలో కనిపించగా, ఆయన కుమార్తె తల్లాడ మండలం కేశ్వాపురంలోని బంధువుకు ఫోన్‌చేసి ఆరా తీసింది. దీంతో ఆయన స్టేజీ పినపాకలోని ఇంట్లో పరిశీలించగా దుర్వాసన వస్తుండడంతో స్థానికులను అడిగితే జంతువు చనిపోయినట్లు భావించామని తెలిపారు. ఈ విషయమై పోలీసులు చేరుకుని పరిశీలించగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో నాగేశ్వరరావు మృతదేహాన్ని గుర్తించారు. ఆయన అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని కుటుంబీకులు సమాచారం ఇచ్చారు. దీంతో

పూజ చేస్తామంటూ నగలు చోరీ

చింతకాని: బంగారు ఆభరణాలకు పూజ చేస్తామని, తద్వారా సంపద రెట్టింపవుతుందని నమ్మించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని పాతర్లపాడు గ్రామానికి అయ్యప్ప స్వామి మాలధారుల తరహాలో మంగళవారం నలుగురు వచ్చారు. వీరు గ్రామంలో ఒంటరిగా ఉన్న పున్నం కృష్ణవేణి ఇంటికి వెళ్లి తాము ఆభరణాలకు పూజ చేస్తామని, తద్వారా సంపద రెట్టింపవుతుందని చెప్పారు. ఆగంతకులు మాలలో ఉండడంతో నమ్మిన ఆమె బంగారు దిద్దులను ఇచ్చింది. ఆపై వారు ఇచ్చిన తీర్థం తాగగానే కృష్ణవేణి అపస్మారక స్థితికి చేరడంతో చెవిదిద్దులు తీసుకుని పరారయ్యారు. ఆతర్వాత మరికొందరి ఇళ్లకు సైతం వెళ్లి పూజల పేరిట నగదు తీసుకున్నట్లు తెలిసింది. కాగా, స్పృహలోకి వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించిన కృష్ణవేణి ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



సంధ్య (ఫైల్)

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన శీలం సంధ్య(40) పాముకాటుకు గురై చెందింది. ఆమె సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉండగా కాలిపై పాము కాటు వేసింది. దీంత విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సంధ్యకు భర్త, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

మధిర: మండలంలోని జిలుగుమాడులో సోమవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గ్రామానికి చెందిన బాలసాని మురళీకృష్ణ(35) ఖమ్మంలో తాపీ పనులు చేస్తుండగా చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన మాధవితో ఆయన వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో మాధవి పుట్టింట్లో ఉంటుంది. ఆమెను తీసుకొచ్చేందుకు మురళీకృష్ణ ప్రయత్నించగా గొడవలు జరిగాయి. ఈక్రమంలోనే సోమవారం ఆయన పనికి వెళ్లి వచ్చాక, సమీపంలో ఉండే తల్లి క్యారేజీ తీసుకొని వెళ్లగా గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో స్థానికులు పరిశీలించేసరికి మురళీకృష్ణ మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని మధిర టౌన్ సీఐ రమేష్ పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

గడ్డిమందు స్ప్రే చేసిన కూలీ..

పెనుబల్లి: జామాయిల్ తోటలో గడ్డి మందు స్ప్రే చేసే పనికి వెళ్లిన కూలీ అస్వస్థతకు గురై మృతిచెందాడు. పెనుబల్లి మండలం ఏరుగట్లకు చెందిన దుబాకుల రమణ, తదితరులు అదే గ్రామానికి చెందిన లక్కినేని జోగారావు, లక్కినేని వినీల్ జామాయిల్ తోటలో గడ్డి మందు కొట్టే పని ఒప్పుకున్నారు. గతనెల 28నుంచి 30వ తేదీ వరకు మందు కొట్టగా చివరి రోజు ఇంటికి వచ్చాక రమణ వాంతులు చేసుకుంటుండడంతో ఆమె కుమారుడు సత్తుపల్లి, ఆపై ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కాగా, తోట యజమాని నిర్లక్ష్యంతోనే రమణ మృతి చెందిందని ఆమె కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్య



వెంకటమ్మ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కుటుంబ కలహాల నేపథ్యాన ఆశా కార్యకర్త జొన్నలగడ్డ వెంకటమ్మ(32) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సత్తుపల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన వెంకటమ్మ ఆగస్టు 21వ పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు సత్తుపల్లి, ఖమ్మంలో చికిత్స అనంతరం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. ఆమెకు భర్త రాజా, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, వెంకటమ్మ మృతిపై గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

అడవి పంది మాంసం స్వాధీనం

మధిర: మధిర మండలం తొర్లపాడు సమీపాన ఏపీ సరిహద్దులో మంగళవా రం అడవి పందిమాంసాన్ని విక్రయిస్తుండగా అటవీశాఖ అధికారులు స్వా ధీనం చేసుకున్నారు. తెలంగాణ – ఏపీ సరిహద్దులో అడవిపందిని వేటాడి మాంసం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో మధిర సబ్ డివిజన్ అటవీ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాంసాన్ని స్వాధీనం చేసుకోవడమేకాక తొర్లపాడు గ్రామానికి చెందిన గోపిరాజు, శివ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.